# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేదిః 11-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. తీవ్రవాదాన్ని ఎదుర్కోనేందుకు ప్రపంచ దేశాలు కలిసి పని చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
2. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ దసరా శుభాకాంక్షలు తెలిపారు.
3. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ శాశ్వత గృహాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు.
4. రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తూ ఉపాధి కల్పనకు కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.
5. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఈరోజు మహిషాసుర మర్ధినిగా దర్శనమిస్తున్నారు.

==========================

తీవ్రవాదాన్ని ఎదుర్కోనేందుకు ప్రపంచ దేశాలు కలిసి పని చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. లావోస్ లో పర్యటిస్తున్న ప్రధానమంత్రి ఈరోజు వియాంటియాన్‌లో జరుగుతున్న 19వ తూర్పు ఆసియా సదస్సులో ప్రసంగించారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న సంఘర్షణ ఆందోళనకరమని, ఈ ఘర్షణలు గ్లోబల్ సౌత్ దేశాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని అన్నారు. యురేషియా, పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి, సుస్థిరత నెలకొనాలని ఆకాంక్షించారు. సార్వభౌమాధికారం, అంతర్జాతీయ చట్టాలను గౌరవించడం అవసరమని, సమస్యలకు యుద్ధరంగం నుంచి పరిష్కారం లభించదని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు.

--------------------------

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. భక్తి శ్రద్దలతో ప్రజలు జరుపుకునే ముఖ్యమైన పండుగలలో విజయ దశమి ఒకటని, ఈ పండుగ ధర్మ ఆధిపత్యాన్ని, చెడుపై మంచి సాధించిన విజయాన్ని సూచిస్తుందన్నారు. విజయ దశమి పండుగ సందర్భంగా అందరికీ దుర్గాదేవి ఆశీస్సులు ఉండాలని గవర్నర్ ఆకాంక్షించారు.

--------------------------

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ శాశ్వత గృహాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్‌లో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని పేదలందరికీ పారదర్శకంగా నాణ్యమైన ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్రంలో నైపుణ్య గణనను నిర్వహిస్తున్నామని చెప్పారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తూ ఉపాధి కల్పనకు కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో కియా కార్ల షోరూమ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,. రాజధాని ప్రాంతంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని పరిశ్రమలని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కియా కార్ల పరిశ్రమ వల్ల అనంతపురం జిల్లాలో తలసరి ఆదాయం గణనీయంగా పెరిగిందని అన్నారు. విశాఖపట్నంలో టీసీఎస్ సంస్థ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేయనుందని మంత్రి తెలిపారు.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రిపై మహిషాసుర మర్ధినిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఈ రోజు దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయన్నారు. వరదల వంటి విపత్తు సమయంలో అధికారులు సమర్ధవంతంగా పని చేశారని తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని, దుర్గమ్మ అనుగ్రహంతో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. అలాగే దుర్గమ్మను రాష్ట్రంలో పర్యటిస్తున్న నీతిఆయోగ్ ప్రతినిధుల బృందం దర్శించుకుంది.

మరోవైపు రేపు పూర్ణాహుతితో దసరా ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. రేపు సాయంత్రం కృష్ణానదిలో స్వామి అమ్మవార్లకు హంస వాహనంపై తెప్పోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

---------------------------

దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన యువత మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా "యువ సంగం" 5వ దశ కార్యక్రమ నమోదు ప్రక్రియకు ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది. కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే యువ సంగం కార్యక్రమంలో పాల్గొనేందుకు 18 నుంచి 30 ఏళ్ల వయస్సు లోపు యువత, ప్రధానంగా విద్యార్థులు, జాతీయ సేవా పథకం, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్లు అర్హులు. యువ సంగంలో పాల్గొనదలచిన యువత వెబ్ పోర్టల్‌లో తమ పేర్లను ఈనెల 21వ తేది వరకు నమోదు చేసుకోవచ్చని తెలిపింది. కాగా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ను ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంతో జత చేశారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా

శ్రీకాకుళం, విజయనగరం, తిరుపతి జిల్లాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విజయనగరంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కె. అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగ వివక్షతను నిర్మూలించడంతో పాటు బాలికలకు మెరుగైన ఆరోగ్యం కల్పించడం, అన్ని రంగాలలో వారికి సమాన అవకాశాలు కల్పించేందుకు అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

దసరా పండుగను పురస్కరించుకొని కర్నూలు జిల్లాలోని దేవరగట్టులో ప్రసిద్ధ శ్రీ మాలమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాన్ని రేపు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాన్ని నిర్వహించేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవరగట్టు బన్ని ఉత్సవ ఏర్పాట్లపై మా ఆకాశవాణి కర్నూలు జిల్లా ప్రతినిధి సిహెచ్. రామాంజనేయులు మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ (30 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజాభద్రత తదితర అంశాలకు ఉపయోగపడేలా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 14 వేల 770 సీసీ కెమెరాలను కృత్రిమ మేధతో అనుసంధానించనున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడుల శాఖ కార్యదర్శి సురేష్‌కుమార్ తెలిపారు. సీసీ కెమెరాల వినియోగంపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు ఉన్నతాధికారులు, పలు శాఖల అధికారులతో రాష్ట్ర సచివాలయం నుంచి నిన్న నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. టోల్‌గేట్లు, బస్‌స్టాండ్లు, రైల్వేస్టేషన్లలోని సీసీ కెమెరాలను రాష్ట్ర సీసీటీవీ నిఘా నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. ఏఐ అనుసంధానంతో రహదారి ఉల్లంఘనలకు చలానా విధించేందుకు వీలవుతుందని చెప్పారు.

---------------------------

సమాజంలోని అనాథ బాలల సంరక్షణను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని అనంతపురం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు శ్రీదేవి తెలిపారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాల సదన్‌లో ఈ రోజు దసరా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ, దసరా పండుగ పురస్కరించుకొని బాలికలను పూజించుకోవడం ఆనవాయితీ అని, బాల సదన్ లో తల్లిదండ్రులు లేని చిన్నారులకు దసరా పండుగను ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై పూర్తి వివరాలతో కూడిన సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. పనుల్లో పారదర్శకతతోపాటు ప్రజలు వాటి వివరాలు తెలుసుకోవడానికి ఈ విధానం దోహదపడుతుందని తెలిపింది. ఈనెల 14 నుంచి 'పల్లె పండగ' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల 500 కోట్ల రూపాయలతో 30 వేల అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొంది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ రూపొందించిన నమూనా బోర్డుల ఆధారంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టే పనుల వద్ద బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

---------------------------

తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు రథోత్సవాన్ని నిర్వహించారు. ఉభయదేవేరులతో కలిసి మలయప్పస్వామి వారు తిరుమాడ వీధుల్లో ఊరేగారు. ఈ వేడుకలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని రథాన్ని లాగారు. ఈ రోజు రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై కల్కి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దీంతో వాహన సేవలు పూర్తి కానున్నాయి. కాగా రేపు చివరి ఘట్టమైన చక్రస్నానంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను టిటిడి కార్యనిర్వహణాధికారి జె. శ్యామలరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.

---------------------------

సమాజంలో బాలికల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు ఈ రోజు అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా అక్టోబర్ 11వ తేదీన అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించాలని 2011 డిసెంబర్ 19వ తేదీన ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ చేసిన తీర్మానం మేరకు ప్రతి ఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది.

======================